తప్పుడు ధ్రువపత్రాలిస్తే క్రిమినల్ కేసు నమోదు: కలెక్టర్



ధ్రువపత్రాల పరిశీలన కేంద్రంలో పరిస్థితిని కలెక్టర్ సిక్తాపట్నాయక్‌కు వివరిస్తున్న డీఈవో అబ్దుల్ ఘనీ

నారాయణపేట పట్టణం, న్యూస్‌టుడే: అభ్యర్థులు తప్పుడు ధ్రువపత్రాలు సమర్పిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులకు సూచించారు. జిల్లాలో మూడో రోజు కొనసాగుతున్న డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన కేంద్రాన్ని శుక్రవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో ఏమైన సమస్యలు ఉన్నాయా.. అని అభ్యర్థులను అడిగి తెలుసుకున్నారు. అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఇప్పటి వరకు ఎంత మంది అభ్యర్థుల ధ్రువపత్రాలు పరిశీలించారని డీఈవో అబ్దుల్ ఘనీని అడగగా. . 350 మంది అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించినట్లు కలెక్టర్‌కు వివరించారు. అర్హులై ఉండి పరిశీలన కేంద్రానికి రాని అభ్యర్థులకు చరవాణి ద్వారా తెలిపి ధ్రువపత్రాల పరిశీలనకు వచ్చే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. అభ్యర్థుల వివరాలను గంట గంటకు తెలియజేయాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో అధికారులు శ్రీనివాస్, రాంజేంద్ర కుమార్, పద్మనళిని, రామచంద్ర చారి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

గోదాంలో దాచి.. గోప్యంగా మార్చి

సరిహద్దులు దాటుతున్న చౌకబియ్యం

నిఘా

న్యూస్‌టుడే- కోస్గి గ్రామీణం



గుట్టుచప్పుడు కాకుండా అర్ధరాత్రి వేళ పక్క రాష్ట్రాలకు రేషన్ బియ్యం తరలిపోతోంది. గ్రామాల్లో లబ్ధిదారులు, రేషన్ దుకాణాల్లో డీలర్ల నుంచి కొన్న బియ్యాన్ని కోస్గి పట్టణంలోని ఓ గోదాంలో దాచి ఉంచుతున్నారు. పెద్ద మొత్తంలో జమ చేసి, అధికారుల అండదండలతో అర్ధరాత్రి దాటాక వాహనాల్లో యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఒక్క కోస్గి అనే కాదు జిల్లావ్యాప్తంగా పట్టణాల్లో కొందరు బడా వ్యాపారుల కనుసన్నల్లో రేషన్ బియ్యం అమ్మకాలు జరుగుతున్నాయి. లబ్ధిదారుల నుంచి చిల్లరదుకాణందారులు తక్కువ రేటుకు సేకరించి, బడా వ్యాపారికి రెండింతల లాభానికి బియ్యం అమ్ముతున్నారు. అక్కడి నుంచి కొడంగల్, కృష్ణా, నారాయణపేట, దామరగిద్ద, ఊట్కూరు సరిహద్దుల గుండా కర్ణాటకకు వాహనాలు సరకు చేరుస్తున్నాయి.

జిల్లాలో ఇలా..

- కోస్గి మార్కెట్ యార్డులో షటర్ వేసిన దుకాణంలో ఓ వ్యాపారి 64 బస్తాల రేషన్ బియ్యం దాచి పెట్టాడు. శుక్రవారం ఈ విషయం వెలుగులోకి వచ్చింది. పట్టణానికి చెందిన ఇద్దరు వ్యాపారులు, అమ్లికుంట్లలో మరో వ్యాపారి ఇంట్లో గతంలో దాడులు చేసినప్పుడు 153 క్వింటాళ్ల బియ్యం పట్టుబడ్డాయి. సంపల్లి గ్రామంలోని ఓ తోటలో దౌల్తాబాద్‌కు చెందిన బడా వ్యాపారి అద్దెకు గోదాం ఏర్పాటు చేసుకున్నారు. గుట్టు చప్పుడు కాకుండా పెద్ద మొత్తంలో రేషన్ బియ్యం సరఫరా చేస్తున్నారు. గతంలో రెండు డీసీఎంలలో 124 క్వింటాళ్ల బియ్యం పట్టుబడ్డాయి.
- మద్దూరు ఆటోలో బియ్యం తీసుకొచ్చి ఓ చిల్లర దుకాణంలో అమ్ముతుండగా అదనపు కలెక్టర్ పట్టుకొని కేసు నమోదు చేయించారు. కోస్గి నుంచి మద్దూరుకు బియ్యం తరలిస్తుండగా పక్క సమాచారంతో పోలీసులు కేసు నమోదు చేశారు.
- మక్తల్ పట్టణ కేంద్రంలో ఆటోల్లో బియ్యం తరలుతోంది. టాస్క్‌ఫోర్స్ పోలీసులు కేసులు నమోదు చేస్తున్నా, రవాణా ఆగడం లేదు.
- నారాయణపేట పట్టణంలో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వఉంచిన 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు.
- ధన్వాడ, కొండాపూర్‌లు కేంద్రాలుగా బియ్యం రవాణా సాగుతోంది.
- మరికల్, అప్పంపల్లిల్లో బియ్యం పట్టుబడి కేసులు నమోదు చేసినా, తరువాత వాటి పరిస్థితి ఏమిటన్నది తెలియడం లేదు.

పీడీ చట్టం నమోదు చేస్తేనే..

చిల్లర దుకాణాదారులపై అరకొర కేసులు పెట్టి అధికారులు చేతులు దులిపేస్తున్నారు. అలా కాకుండా పీడీ చట్టం కింద కేసు పెడితే దారిలోకి వస్తారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం కొందరు వ్యాపారులు తమదైన శైలిలో అధికారులను ప్రసన్నం చేసుకుని తమ పని కానిచ్చేస్తున్నారు.

బోర్డులు ఏర్పాటు చేస్తాం

రేషన్‌బియ్యం కొనుగోలు చేసి తరచుగా పట్టుబడిన వ్యాపారులపై పీడీ చట్టం కింద కేసు పెడతాం. రేషన్ బియ్యం కొనుగోలు చేయం అంటూ దుకాణాల వద్ద బోర్డులు పెట్టిస్తాం. ఎక్కడైనా నిల్వలుంటే మాకు చెప్పాలి. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

- ఆనంద్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ

పట్టుబడితే క్రిమినల్ కేసులు..

ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యాన్ని అక్రమ రవాణా చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. పోలీసు గస్తీని ముమ్మరం చేయిస్తాం. రాత్రి వేళల్లో వాహనాల తనిఖీలు చేపడతాం.

- లింగయ్య, డీఎస్పీ, నారాయణపేట

అన్ని సౌకర్యాలతో తీర్చిదిద్దుతాం

వార్ల ప్రమాణ స్వీకారంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రియాజ్



విజయకుమార్, రియాజ్‌లను సన్మానిస్తున్న పోలీసు గృహనిర్మాణ సంస్థ ఛైర్మన్ గుర్నాథ్‌రెడ్డి, పేట, మక్తల్ ఎమ్మెల్యేలు పర్ణికరెడ్డి, వాకిటి శ్రీహరి, నాయకులు

నారాయణపేట పట్టణం, న్యూస్‌టుడే : నారాయణపేట జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ప్రొఫెసర్ రియాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని వేడుకల మందిరంలో శుక్రవారం జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ వార్ల విజయ్ కుమార్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా గ్రంథాలయాన్ని అన్ని సౌకర్యాలతో తీర్చిదిద్దుతామన్నారు. ధన్వాడ, మరికల్, మక్తల్, ఊట్కూరు, కోస్గి లైబ్రరీలను అభివృద్ధి చేస్తామన్నారు. రాష్ట్రంలోని గ్రంథాలయాల్లో ఖాళీలను నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. పోలీసు గృహనిర్మాణ సంస్థ ఛైర్మన్ గురునాథ్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న కృషిని కొనియాడారు. ఎమ్మెల్యేలు పర్ణికరెడ్డి, శ్రీహరి మాట్లాడుతూ యువత సామాజిక మాధ్యమాల మోజులో గ్రంథాలయాలను పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ప్రాంతాల వారీగా అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచితే ఉపయోగకరమని అన్నారు. పేట, కోస్గి పుర ఛైర్‌పర్సన్లు గందె అనసూయ, కోడిగంటి అన్నపూర్ణ, నాయకులు హరినారాయణ భట్టడ్, సదాశివారెడ్డి, ప్రశాంత్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మచారిణిగా జోగులాంబ



అలంకారంలో జోగులాంబ అమ్మవారు

అలంపూర్, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం రెండో రోజు జోగులాంబ అమ్మవారు బ్రహ్మచారిణి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయాల్లో వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవీ నవరాత్రుల్లో శుక్రవారం నుంచి ఈ నెల 11వ తేదీ వరకు రోజూ ఆలయంలో ఆర్జిత సేవలు నిర్వహిస్తున్నారు. ఉదయం సహస్రనామార్చన, కుంకుమార్చన, శ్రీచక్ర నవావరణ అర్చన, చండీహోమం, రాత్రి 7 గంటలకు కొలువు పూజలో భాగంగా సువాసిని, కుమారి పూజలను అర్చకులు నిర్వహించారు. అంతకు ముందు జోగులాంబ ఉత్సవ విగ్రహాన్ని ఆలయం చుట్టూ రథంపై ప్రదక్షణ నిర్వహించారు. ఈవో పురేందర్, అర్చకులు, ధర్మకర్తల సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న డిజిటల్ కార్డుల సర్వే

మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డిజిటల్ కార్డుల సర్వే పట్టణంలోని 13వ వార్డులో రెండోరోజు కొనసాగింది. పుర కమిషనర్ భోగేశ్వర్లు తన సిబ్బందితో కలిసి వార్డులో ఇంటింటికి తిరిగి ప్రభుత్వం నిర్దేశించిన 11 కాలమ్స్‌తో కూడిన డిజిటల్ దరఖాస్తు ఫారాలను పూరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైలెట్ ప్రాజెక్టు కింద పట్టణంలోని 13వ వార్డును ఎంపిక చేయడం జరిగిందని ఐదు పని దినాల్లో ఈ సర్వే పూర్తి అవుతుందని నివేదికను కలెక్టర్‌కు అందించనున్నట్లు తెలిపారు.

మహిళను మోసం చేసిన యువకుడు

కోస్గి గ్రామీణం, న్యూస్‌టుడే : ఊరికి తీసుకువెళ్తానని మాయమాటలు చెప్పి ఓ మహిళను మోసం చేసిన ఘటన నారాయణపేట జిల్లా కోస్గి పట్టణంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. వికారాబాద్ జిల్లా దోమ మండలం గుండాల గ్రామానికి చెందిన చెన్నయ్య డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలానికి చెందిన ఓ మహిళ కోస్గి పట్టణానికి వ్యక్తిగత పనిపై వచ్చింది. పని పూర్తయ్యాక గురువారం రాత్రి బస్సు కోసం బస్టాండులో వేచి చూస్తోంది. ఈ క్రమంలో చెన్నయ్య ఆమెతో మాటలు కలిపారు. మీ ఊరికి ద్విచక్ర వాహనంపై దింపుతానని నమ్మబలికాడు. అతని మాటలు నమ్మిన మహిళ వాహనంపై వెళ్లింది. ఆమెను పట్టణంలో వేరే ప్రాంతానికి తీసుకెళ్లి బెదిరించి లొంగదీసుకున్నాడు. ఆమె వద్ద రూ.5 వేలు లాగేసుకున్నాడు. రాత్రి అక్కడే వదిలేసి పారిపోయాడు. శుక్రవారం ఆమె పోలీసు ఠాణాకు వెళ్లి ఫిర్యాదు చేసింది. పోలీసులు చెన్నయ్య పట్టుకుని విచారించారు. నిందితుడిపై కేసు నమోదు చేశారు.

క్రీడలకు అత్యంత ప్రాధాన్యం

ఎస్‌జీఎఫ్ కుస్తీ పోటీల ప్రారంభంలో ఎమ్మెల్యే పర్ణికరెడ్డి



రెజ్లింగ్ పోటీలను లాంఛనంగా ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ధన్వాడ, న్యూస్‌టుడే : తమది క్రీడలకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చే ప్రభుత్వమని నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికరెడ్డి అన్నారు. శుక్రవారం ధన్వాడ అప్పాజీ మైదానంలో 68వ రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ బాలికల రెజ్లింగ్ పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం కప్‌లోనూ రెజ్లింగ్‌కు అవకాశం కల్పించామన్నారు. ధన్వాడలో రెజ్లింగ్ హాలు నిర్మాణం కోసం రూ.11 లక్షలు కలెక్టరు కేటాయించారన్నారు. డీవైఎస్‌వో వెంకటేశ్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ డాక్టర్ రియాజ్, ధన్వాడ విండో అధ్యక్షుడు వెంకట్రామారెడ్డి, పేట మార్కెట్ కమిటీ అధ్యక్షుడు సదాశివరెడ్డి, ఉపాధ్యక్షుడు హన్మంతు, డైరెక్టర్లు రాంచంద్రయ్య, రాగ్యానాయక్, లక్ష్మయ్యగౌడ్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా కుస్తీ ప్రారంభం


ధన్వాడ, న్యూస్‌టుడే : నారాయణపేట జిల్లా ధన్వాడలోని అప్పాజీ మైదానంలో శుక్రవారం రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) బాలికల రెజ్లింగ్(కుస్తీ) పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మహబూబ్‌నగర్, హైదరాబాద్, రంగారెడ్డి, నల్గొండ, నిజామాబాద్, వరంగల్, మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన క్రీడాకారులు 300 మంది పాల్గొన్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన క్రీడాకారులు పోటీలకు దూరంగా ఉన్నారు. నారాయణపేట ఎమ్మెల్యే డా. చిట్టెం పర్ణికరెడ్డి జాతీయ పతాక ఆవిష్కరణతో కార్యక్రమం ప్రారంభం కాగా ఆదిలాబాద్ క్రీడాకారులు వందన సమర్పణ చేస్తూ ముందుకు కదిలారు. మహబూబ్‌నగర్ క్రీడాకారులతో ఈ కార్యక్రమం ముగిసింది. తదుపరి ఎమ్మెల్యే పోటీలను లాంఛనంగా మొదలెట్టారు. మధ్యాహ్నం పెద్ద వర్షం పడటంతో మైదానంలో పోటీల నిర్వహణకు అంతరాయం ఏర్పడింది.

హోరాహోరీగా హ్యాండ్‌బాల్ పోటీలు

కోస్గి న్యూటౌన్, న్యూస్‌టుడే : నారాయణపేట జిల్లా కోస్గి పట్టణంలో రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ పోటీలు శుక్రవారం హోరాహోరీగా కొనసాగాయి. బాలికల విభాగంలో ఉమ్మడి జిల్లాల నుంచి పది జట్లు పోటీపడగా కరీంనగర్ - మహబూబ్‌నగర్ మొదటి సెమీ ఫైనల్, ఆదిలాబాద్ - వరంగల్ జట్లు ద్వితీయ సెమీఫైనల్‌కు చేరుకున్నాయి. చివరికి కరీంనగర్, ఆదిలాబాద్ జట్లు ఫైనల్‌కు చేరాయి. బాలుర విభాగంలో మొదటి సెమీ ఫైనల్‌లో మహబూబ్‌నగర్ - వరంగల్ జట్లు తలపడగా మహబూబ్‌నగర్ జట్టు ఫైనల్‌కు చేరింది. రెండో సెమీఫైనల్‌లో కరీంనగర్ - హైదరాబాద్ మ్యాచ్ శనివారం మొదటి సెషన్‌లో ఏర్పాటు చేస్తామని నిర్వాహకులు వివరించారు. ఈ కార్యక్రమంలో బాల్‌రాజ్, నర్సిములు, శ్రీనివాస్, రఫత్ పాల్గొన్నారు.

విస్తీర్ణంలో దేశంలో రెండో అతి పెద్ద పులుల అభయారణ్యం నల్లమల. అరుదైన వన్యప్రాణులు, పక్షులు, వృక్షాలు, ఔషధ మొక్కలకు నెలవు. 2611 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలోని ఏటీఆర్‌లో ఎంతో జీవవైవిధ్యం కనిపిస్తుంది. కర్ణాటక సరిహద్దు కృష్ణా తీరం కూడా జీవ జాతులకు ఆలవాలమే. వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాలు సందర్భంగా ఇక్కడి విశేషాలు తెలుసుకుందాం.

జీవుల ఆలవాలం.. నిలపాలి కలకాలం



మద్దిమడుగు రేంజ్‌లో కనిపించే అరుదైన చింకార



మూషిక జింకలు



ధన్వాడలో శుక్రవారం నిర్వహించిన వన్యప్రాణుల సంరక్షణ ర్యాలీ

న్యూస్‌టుడే- అమ్రాబాద్, కృష్ణ

ఉమ్మడి పాలమూరు జిల్లా అరుదైన వన్యప్రాణులకు ఆలవాలం. అందులోనూ నల్లమల ప్రత్యేకం. సుమారు 180 కిలోమీటర్ల సరిహద్దుగా ఉన్న కృష్ణానది వేసవిలో జంతుజాలం దప్పిక తీరుస్తూ కాపాడుతోంది. అటవీ అధికారుల చర్యల మూలంగా 10 లోపు ఉన్న పెద్ద పులుల సంఖ్య 38కి చేరుకుంది. క్రమేపీ ఇతర జంతువుల సంఖ్య పెరుగుతోంది. అంతరించి పోయే దశలో ఉన్న జంతుజాతుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. నల్లమలలో పెద్దపులులతో పాటు జింకలు, మనుబోతులు, దుప్పులు, చిరుతపులులు, అడవి పందులు, ఎలుగు బంట్లు, కొండగొర్రెలతో పాటు ఎన్నో జాతుల జంతువులు నివసిస్తున్నాయి.

ఏం చేస్తున్నారు?

ఒకప్పుడు నల్లమలలో విస్తారంగా ఉన్న మూషిక జింకలు వివిధ కారణాల వల్ల అంతరించి పోయాయి. వానిని పునరుద్ధరించేందుకు అధికారులు హైదరాబాద్‌లోని నెహ్రూ జంతు ప్రదర్శన శాల నుంచి తెప్పించి అభివృద్ధి పరుస్తున్నారు. ఇందులో భాగంగా మన్ననూరు రేంజ్‌లోని పిచ్చకుంట్లోని చెరువు ప్రాంతంలో ప్రత్యేక షెడ్డు ఏర్పాటు చేసి అందుకు అనువైన వాతావరణ పరిస్థితులు కల్పిస్తున్నారు. ఒక్కొక్క బ్యాచ్‌కు 6 ఆడ, 2 మగ మూషిక జింకల చొప్పున 17 బ్యాచులు హైదరాబాద్ నుంచి తెచ్చి నల్లమల వాతావరణానికి అలవాటయ్యే వరకు షెడ్డుల్లో పెంచి నెల తర్వాత అడవిలో వదులుతున్నారు. క్రమేపీ వాటి సంఖ్య పెరుగుతున్నట్లు అధికారులు తెలిపారు. అటవీప్రాంతం పొడుగునా ప్లాస్టిక్ నిషేధించారు.

చికారాలు ప్రత్యేకం

కృష్ణ జింకలను పోలి ఉండే చింకారాలు ఏటీఆర్‌కే ప్రత్యేకం. నల్లమలలోని మద్దిమడుగు రేంజ్‌తో పాటు కవ్వాల్ పెద్దపులుల అభయారణ్యంలో మాత్రమే ఇవి కనిపిస్తాయి. వంపులు తిరిగిన కొమ్ములు, బెదురు చూపులతో అత్యంత పిరికిగా ఉండే చింకారాల అభివృద్ధికి అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈప్రాంతంలో ఉండే పశువులు, గొర్రెల మందలు వాటి అభివృద్ధికి ఆటంకంగా మారాయి. అడవిలో లభించే మేతను పశువులు, గొర్రెలు తినిపోవటంతో ఇవి ఆహారం కోసం ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లే అవకాశం ఉంది. దీంతో ఈప్రాంతంలో పశువులు, గొర్రెల మందలను అధికారులు నియంత్రిస్తున్నారు. వేటగాళ్లపై ప్రత్యేక నిఘా ఉంచటంతోపాటు తాగునీటి వసతికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

ఆవాసాల్లోకి మొసళ్లు, జింకలు

గత 30 ఏళ్ల క్రితం వరకు జింకలు, మొసళ్లను వేళ్లపై లెక్కించేవారు. ఇప్పుడు వాటి సంతతి గణనీయంగా పెరిగింది. నీటి లభ్యతతో పాటు విరివిగా ఆహారం లభించడంతో సంతతి గణనీయంగా పెరిగింది. మొసళ్ల విషయానికి వస్తే మొసలి పిల్ల చాలా చిన్నదిగా ఉంటుంది. నదిలో నుంచి నీరు ఎత్తిపోసే క్రమంలో ఆయా మోటార్ల ద్వారా పంట కాలవలలోకి చేరి సమీపంలోని చెరువులలోకి చేరుతున్నాయి. మనిషి అత్యధికంగా కోడి మాంసం తింటూ ఉండటంతో వాటి వ్యర్థాలు స్థానిక చెరువులు, నీటి కుంటలలో పార వేస్తున్నారు. దీంతో మొసళ్లకు మంచి ఆహారం లభిస్తుండటంతో జనావాసాలలోకి చేరుతున్నాయి. ఒకప్పుడు కర్ణాటక సరిహద్దులో కనిపించే జింకలు ఇప్పుడు పూర్తిగా గ్రామాల శివార్లలోకి చొచ్చుకొచ్చి పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ఈ మధ్య ఊట్కూరు వచ్చిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి ఈ సమస్యపై రైతులు మొరపెట్టుకున్నారు. కృష్ణా మండలం ముడుమాల్ వద్ద జింకల సంరక్షణ కోసం 70 ఎకరాల స్థలం కేటాయించారు. రూ. 2 కోట్లు నిధులు మంజూరు చేశారు. ఆ తరువాత ఈ కేంద్రం ఏర్పాటు ముందుకు సాగలేదు. ప్రజలకు జీవ వైవిధ్యంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అటవీశాఖాధికారి నీలేష్ 'న్యూస్‌టుడే'తో అన్నారు.

నీటి కుక్కలు



కృష్ణానదిలోని నీటి కుక్కలు

నాగర్‌కర్నూల్ జిల్లా సోమశిల నుంచి నాగార్జునసాగర్ వరకు ఉన్న సుమారు 180 కిలో మీటర్ల పొడవైన కృష్ణానదితో పాటు లింగాల, తెలకపల్లి ప్రాంతాల్లో నీటి కుక్కలు కనిపిస్తాయి. చేపలు, ఎండ్రగిచ్చలు ఆహారంగా తీసుకునే నీటి కుక్కలు మత్స్యకారులు చేపల కోసం వేసే వలలో చిక్కుకుని మృతి చెందుతుంటాయి. ఈకారణంగా నానాటికి నీటికుక్కలు అంతరించి పోయే అవకాశం ఉంది. ఇవే కాకుండ పసుపు గొంతు బుల్‌బుల్ పిచ్చుక, స్పాట్ బెల్లీడ్ డేగ-గుడ్లగూబ, బ్లాక్ బాజా లాంటి అరుదైన పక్షి జాతులు నల్లమలలో ఉన్నాయి.

అండర్-19 క్రికెట్ ఫైనల్‌కు పాలమూరు జట్టు

సెమీస్‌లో ఖమ్మంపై 60 పరుగుల తేడాతో ఘన విజయం



సెమీస్‌లో నెగ్గి ఫైనల్‌కు చేరిన ఉమ్మడి జిల్లా జట్టు

మహబూబ్‌నగర్ (క్రీడలు, న్యూస్‌టుడే : హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అండర్-19 రాష్ట్రస్థాయి టోర్నీలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు ఫైనల్‌కు చేరింది. శుక్రవారం వరంగల్‌లోని మొగిలిచర్ల మైదానంలో నిర్వహించిన సెమీస్‌లో ఖమ్మం జట్టుపై 60 పరుగుల తేడాతో నెగ్గింది. జిల్లా జట్టు నుంచి అబ్దుల్ రాఫె 110 పరుగులతో ఆకట్టుకున్నాడు. మొదట బ్యాటింగ్‌కు దిగిన పాలమూరు జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 234 పరుగులు చేసింది. జిల్లా జట్టు నుంచి అబ్దుల్ రాఫె 110 (146 బంతుల్లో 4×11, 6×2) సాయంతో శతకం బాదాడు. కె. సాహిల్ 45, నగేశ్ 25, షాదాబ్ అహ్మద్ 22 పరుగులు చేశారు. అనంతరం ఖమ్మం జట్టు 39.3 ఓవర్లలో 174 పరుగులకు ఆలౌట్ అయింది. మహబూబ్‌నగర్ జట్టు నుంచి ముఖీత్ 4, బి. రాజు, శశాంక్, షాదాబ్, సాహిల్ ఒక్కో వికెట్ తీశారు. శనివారం ఫైనల్‌లో జిల్లా జట్టు కరీంనగర్‌తో తలపడనుంది. ఫైనల్‌కు చేరిన జట్టును ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం. రాజశేఖర్, శిక్షకుడు అబ్దుల్లా, సంఘం సభ్యులు అభినందించారు.


ఆటలతో ఐక్యత, ఆరోగ్యం



ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న అంజయ్యయాదవ్. చిత్రంలో నవీన్‌కుమార్‌రెడ్డి, నరేందర్ తదితరులు

షాద్‌నగర్ న్యూటౌన్, న్యూస్‌టుడే: క్రీడల ద్వారా ఐకమత్యం, సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని, అలాంటి ఆటలకు నిత్యం కొంత సమయం కేటాయించాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. షాద్‌నగర్ మినీస్టేడియంలో భారాస నాయకుడు నందారం అశోక్ ఆధ్వర్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ఏర్పాటు చేశారు. వీటిని శుక్రవారం వారు ప్రారంభించి మాట్లాడారు. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఎంచుకున్న క్రీడలో రాణించాలని క్రీడాకారులను కోరారు. ఈ టోర్నమెంట్ 15 రోజులపాటు జరుగుతుందని, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి 70 టీంలు ఇందులో పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పురపాలిక ఛైర్మన్ నరేందర్, వైస్‌ఛైర్మన్ నటరాజ్, శ్రీనివాస్‌గౌడ్, సుధీర్, బచ్చల నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

అర కోటితో అలంకారం.. ఆకట్టుకునే రూపం



కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే : కొల్లాపూర్‌లోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు ధనలక్ష్మిగా దర్శనమిచ్చారు. రూ.50 లక్షలు విలువజేసే నోట్లతో అమ్మవారిని అలంకరించారు. ఆర్యవైశ్య మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సుదర్శన్‌శెట్టి, సభ్యులు పాల్గొన్నారు. వరిదేల శమీవృక్షం వద్ద ఉన్న దుర్గామాతను గాయత్రి అవతారంలో అలంకరించారు.

అలంపూర్ ఆలయాల ఛైర్మన్‌గా నాగేశ్వర్‌రెడ్డి



ఆలయాల నూతన ధర్మకర్తల సభ్యులు, చిత్రంలో సంపత్‌కుమార్

అలంపూర్, న్యూస్‌టుడే: అలంపూర్ ఆలయాల నూతన ధర్మకర్తల కమిటీ సభ్యులతో శుక్రవారం ఈవో పురేందర్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం కమిటీ సభ్యులు ఆలయ ఛైర్మన్‌గా కొంకల నాగేశ్వర్‌రెడ్డి పేరును ప్రతిపాదించారు. అందరూ ఆమోదించడంతో ఏకగ్రీవంగా ఛైర్మన్‌గా ఆయన ఎన్నికయ్యారు. ఈవో ప్రమాణ స్వీకారం చేయించారు. అంతకు ముందు కమిటీ సభ్యులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. నూతనంగా ఎన్నికైన ఛైర్మన్‌కు మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ మిఠాయి తినిపించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కష్టపడిన వారికి పదవులు ఉంటాయన్నారు. ఆర్డీఎస్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామన్నారు. జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ సరిత దంపతులు, టెలికం సలహా సంఘం సభ్యుడు ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో వసతుల కల్పనకు చర్యలు



దేవరకద్రలో గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర గ్రంథాలయ ఛైర్మన్ రియాజ్

మహబూబ్‌నగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే : గ్రంథాలయాలకు వస్తున్న పాఠకులకు పోటీ పరీక్షల పుస్తకాలు, అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని గ్రంథాలయ సంస్థ రాష్ట్ర ఛైర్మన్ డా. రియాజ్ అన్నారు. శుక్రవారం రాత్రి మహబూబ్‌నగర్ పట్టణం మెట్టుగడ్డలోని కేంద్ర గ్రంథాలయాన్ని, దేవరకద్ర గ్రంథాలయాన్ని సందర్శించారు. అక్కడున్న పాఠకులతో మాట్లాడారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో డా. రియాజ్ గ్రంథాలయంలో సమస్యలపై యువతను ఆరాతీయగా భవనాన్ని విస్తరించాలని, మరిన్ని కుర్చీలు, పోటీపరీక్షల కొత్త పుస్తకాలు, మాసపత్రికలను సమకూర్చాలని కోరారు. మహబూబ్‌నగర్, నారాయణపేట గ్రంథాలయాల కార్యదర్శులు మనోజ్‌కుమార్, సురేశ్‌బాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మల్లు నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

మహిళా సమాఖ్యలో భారీ కుంభకోణం

- సభ్యులకు తెలియకుండానే వారి పేర్లపై రుణాలు
- లబోదిబోమంటున్న మహిళలు

న్యూస్‌టుడే, పాలమూరు పురపాలకం : పాలమూరు పురపాలిక 17వ వార్డు కోయనగర్ శ్రీసాయి మహిళా సంఘాల సమాఖ్య (ఎస్ఎల్ఎఫ్ - స్లమ్ లెవల్ ఫెడరేషన్)లో భారీ కుంభకోణం వెలుగు చూసింది. మహిళా సంఘాల పొదుపు ఖాతాలు పర్యవేక్షించే ఓ ఆర్పీ సభ్యులుగా ఉన్న మహిళలకు తెలియకుండానే వారి పేర్ల మీద భారీ మొత్తంలో రుణాలు తీసుకుని అవకతవకలకు పాల్పడ్డారు. దీనిపై ఎస్ఎల్ఎఫ్ పరిధి పలు సంఘాల మహిళలు పురపాలిక కమిషనర్ మహేశ్వర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని కూడా కలిసి ఫిర్యాదు చేశారు. ఆగ్రహించిన ఎమ్మెల్యే వెంటనే కోయనగర్ ఎస్ఎల్ఎఫ్‌పై విచారణ చేయించినా మెప్మా అధికారులకు సూచించారు. మెప్మా డీఎంసీ శివకుమార్ కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించారు. కోయనగర్ ఎస్ఎల్ఎఫ్‌లో మహిళల పొదుపు సొమ్ముతో పాటు రుణాల పేరిట ఆర్పీ పెద్ద మొత్తంగా అవకతవకలకు పాల్పడినట్లు ఫిర్యాదులు వచ్చాయని, ఎమ్మెల్యే, పుర కమిషనర్ ఆదేశాలతో ముగ్గురు సీవోలు, నలుగురు సీనియర్ ఆర్పీలతో కూడిన మూడు బృందాలను ఏర్పాటు చేసి శనివారం నుంచి కోయనగర్ ఎస్ఎల్ఎఫ్‌పై విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. అవకతవకలు వాస్తవమేనని, ఇటీవల కొంత మంది మహిళలు ఆర్పీపై ఫిర్యాదు చేయడంతో నయానా భయానా రూ.6 లక్షల వరకు సొమ్ము రికవరీ చేయించానని వార్డు కౌన్సిలర్ జంగమ్మ 'న్యూస్‌టుడే'తో చెప్పారు. ఈ వ్యవహారం బయటకు పొక్కడంతో మిగతా సంఘాల వాళ్లు కూడా అక్రమాలు జరిగినట్లు గుర్తించి ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు.

బ్యాంకు అధికారులు ఏం చేసినట్లు?

కోయనగర్ ఎస్ఎల్ఎఫ్ పరిధిలో 32 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. ఒక్కో సంఘంలో 10 నుంచి 15 వరకు మహిళలు సభ్యులుగా ఉన్నారు. సభ్యులు బ్యాంకు లింకేజీ కింద రుణాలు తీసుకోవాలంటే వారి పేర్లతో ఆర్పీ సూక్ష్మ రుణ ప్రణాళిక (ఎంసీపీ - మైక్రో క్రెడిట్ ప్లాన్) తయారు చేసి ఒక్కో సభ్యురాలి సంతకం తీసుకోవాల్సి ఉంటుంది. ఎంసీపీని బ్యాంకులో సమర్పించాక క్షేత్రాధికారి (ఫీల్డ్ ఆఫీసర్) పరిశీలించి ఆయా మహిళలతో మాట్లాడి మరోమారు వారి సంతకాలు తీసుకుని వారి ఖాతాల్లోనే రుణ మొత్తం జమ చేయాలి. ఇందుకు భిన్నంగా జిల్లా కేంద్రంలోని ఓ బ్యాంకుకు చెందిన క్షేత్రాధికారి ఆర్పీ చెప్పినట్లు విని మహిళల సంతకాలు తీసుకోకుండానే ఒక్కో మహిళ పేరు మీద రూ.50వేల నుంచి రూ. లక్ష వరకు రుణాలు మంజూరు చేసి నిధులు పక్కదారి పట్టించినట్లు తెలుస్తోంది. ఇలా 32 సంఘాల్లోని చాలా మంది సభ్యుల పేర్ల మీద వారికి తెలియకుండానే ఆర్పీ పెద్ద మొత్తంలో రుణాలు తీసుకున్నట్లు మహిళలు ఆందోళనకు గురవుతున్నారు. శనివారం నిర్వహించే విచారణకు అన్ని సంఘాల సభ్యులు బ్యాంకు ఖాతా పుస్తకాలు, ఇతర దస్త్రాలతో హాజరు కావాలని సూచించామని, విచారణలో అవకతవకలు పూర్తిస్థాయిలో బహిర్గతం అయ్యే అవకాశం ఉంటుందని మెప్మా డీఎంసీ పేర్కొన్నారు.

నకిలీ మావోయిస్టును పట్టించిన సాంకేతికత



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ గిరిధర్‌రావు

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : నక్సలైట్‌నని ఓ రైస్‌మిల్లు వ్యాపారిని బెదిరించి ఫోన్‌పే ద్వార డబ్బు తీసుకున్న ఓవ్యక్తిని పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. శుక్రవారం వనపర్తి కార్యాలయంలో ఎస్పీ రావుల గిరిధర్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన తిప్పిరెడ్డి సుదర్శన్‌రెడ్డి అలియాస్ ప్రమోద్‌రెడ్డి ఇటీవల వనపర్తి జిల్లా ఖిల్లాగణపురం మండలం సోలీపూర్ గ్రామానికి చెందిన మిల్లు యజమాని శేఖర్‌రెడ్డికి ఫోన్ చేసి తాను మాజీ నక్సలైట్‌నని. . రైస్‌మిల్లు అసోసియేషన్ నుంచి రూ.50 లక్షలు ఇవ్వాలని డిమాండు చేశారు. డబ్బులివ్వకుంటే చంపుతానని బెదిరించారు. ఈ నెల రెండో తేదీన హైదరాబాద్‌లోని బోడుప్పల్‌లోని కమిషన్ బేస్డ్ వ్యక్తికి చెందిన ఫోన్‌పే నంబరుకు రూ.8 వేలు జమ చేయాలని శేఖర్‌రెడ్డికి చెప్పారు. బాధితుడు రూ.8 వేలు పంపించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఖిల్లాగణపురం పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం నిందితుడు డబ్బు తీసుకునేందుకు కమిషన్ బేస్డ్ వ్యక్తి ఇంటి వద్దకు రాగా కొత్తకోట సీఐ రాంబాబు, ఖిల్లాగణపురం ఎస్సై సురేశ్‌గౌడ్ పట్టుకున్నారు. అతన్ని విచారించగా నేరం ఒప్పుకొన్నాడు. నిందితుడు పెద్దపల్లిలో సుల్తానాబాద్, కరీంనగర్, సుబేదారి, మిర్యాలగూడ ప్రాంతాల్లో కొందరిని బెదిరించి డబ్బు తీసుకోవడంతో కేసులు నమోదయ్యాయి. కేసును త్వరగా ఛేదించిన కొత్తకోట సీఐ, ఖిల్లాగణపురం ఎస్సై, పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు. వీరికి రివార్డు ఇస్తామన్నారు. విలేకరుల సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వరరావు, కొత్తకోట సీఐతో పాటు వనపర్తి సీఐ నాగభూషణంరావు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

కానిస్టేబుల్ సస్పెన్షన్

అయిజ, న్యూస్‌టుడే: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించే వారికి సహకరిస్తున్న అయిజ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆర్. కృష్ణయ్యను సస్పెండ్ చేస్తూ ఎస్పీ టి. శ్రీనివాసరావు శుక్రవారం ఉత్తర్వులు చేశారు. బాధ్యతారాహిత్యం, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం కారణంగా శాఖాపరమైన చర్యలు చేపట్టారు. రేషన్‌బియ్యాన్ని తరలిస్తున్న వారికి సహకరిస్తున్నాడని వచ్చిన ఆరోపణలపై విచారణ చేసిన అనంతరం రుజువుకావడంతో సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పోలీసులు ఇలాంటి చర్యలకు పాల్పడితే ఉపేక్షించేదిలేదని ఎస్పీ కార్యాలయం నుంచి వెలువడిన ప్రకటనలో తెలిపారు.

ఒకే రోజు ముగ్గురిపై శునకాల దాడి



గాయాలపాలైన రేవంత్

మానవపాడు, న్యూస్‌టుడే: ఒకే రోజు ముగ్గురు వ్యక్తులపై శునకాలు దాడిచేశాయి. అమరవాయి గ్రామానికి చెందిన పరశురాముడు కుమారుడు రేవంత్ శుక్రవారం ఉదయం పాల ప్యాకెట్ తీసుకురావడానికి ఇంటి నుంచి దుకాణానికి బయలు దేరాడు. వెళ్తున్న క్రమంలో రేవంత్‌పై కుక్కల గుంపు దాడికి పాల్పడింది. బాలుడు గట్టిగా కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు, కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకొని శునకాలను చెదరగొట్టారు. అప్పటికే బాలుడిని కుక్కలు తీవ్రంగా గాయపరిచాయి. ప్రాథమిక చికిత్స అనంతరం కుటుంబ సభ్యులు రేవంత్‌ను కర్నూలు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అదే గ్రామానికి చెందిన రామదాసు కుమారుడు శివపైనా కూడా కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. పెద్దఆముదాలపాడు గ్రామానికి చెందిన రామకృష్ణ వ్యక్తిగత పనుల నిమిత్తం వస్తుండగా అమరవాయిలో శునకాలు దాడి చేసి గాయపరిచాయి. వీరిద్దరూ స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించుకున్నారు. గ్రామాల్లో శునకాల స్వైరవిహారాన్ని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	114–00
రిటైల్	136–00
డ్రెస్డ్	197–00
స్కిన్‌లెస్	224–00

మేమున్నాం.. మీకు తోడుగా.. ఉ॥ 10 గం. నుంచి మ॥ 1 వరకు

పేట పట్టణం : 9441816587 | మక్తల్ గ్రామీణం : 7680923728
ధన్వాడ : 8008573834 | దామరగిద్ద : 8008573836


మైనార్టీ కాలనీలో ఇళ్ల మధ్య నిలిచిన మురుగు

సమస్య : రెండు నెలలుగా ప్రభుత్వాసుపత్రి ముందు గుంత తవ్వి వదిలేయడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. **- రాము, మక్తల్**

సమాధానం: మంచినీటి సౌకర్యం కోసం గుంత తవ్వి గుత్తేదారు పూడ్చలేదు. త్వరలో గుంతను పూడ్పిస్తాం. **- యాదగిరి, ప్రభుత్వాసుపత్రి మక్తల్.**

సమస్య : మైనార్టీ కాలనీలో ఇళ్ల మధ్యన మురుగు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. **- నయుం, కాలనీవాసి**

సమాధానం : ఇటీవల కాలంలో కాలనీకి సీసీ రోడ్డు వేయడం జరిగింది. త్వరలో మిగతా కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించి సమస్యను పరిష్కరిస్తాం. **- భోగేశ్వర్లు, పుర కమిషనర్.**

సమస్య : సంగంబండ రోడ్డు వద్ద కరెంటు తీగలు చెట్ల మధ్యలో ఉండి తరచూ షార్ట్ సర్క్యూట్ ఏర్పడుతుంది **- సిద్దప్ప, వైద్యుడు, మక్తల్**

సమాధానం : కరెంటు తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించి సమస్యను పరిష్కరిస్తాం **- రామకృష్ణ, ఏఈ, మక్తల్.**

సమస్య: ప్రైవేటు వైద్యశాలలు తమ ఆసుపత్రి వ్యర్థాలు రోడ్లపై వేస్తున్నారు **- రాజు, మక్తల్**

సమాధానం: ఈ విషయం ఇప్పటికే మా దృష్టికి వచ్చింది. ప్రైవేటు ఆసుపత్రి యజమానులు రోడ్లపై వ్యర్థాలు వేయకుండా పుర వాహనాల్లో తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇస్తాం. **- అమర్, మున్సిపల్ అధికారి.**

- న్యూస్‌టుడే, మక్తల్ పట్టణం

తెరపై ఈనాడు

దేవర: వనయాంబ(కోస్గి), వెంకటరమణ(మక్తల్), మనోహర్ (నారాయణపేట), **సత్యం సుందరం:** మహేశ్వర(నారాయణపేట)

- న్యూస్‌టుడే, పాతబస్టాండ్, మక్తల్ రూరల్

కూరగాయల ధరలు(కిలోకు)



నారాయణపేట (పాతబస్టాండ్) న్యూస్‌టుడే : టమాట రూ.70, వంకాయలు రూ.60, ముళ్ల వంకాయలు రూ60, ఆలుగడ్డ రూ.50, కాకరకాయ రూ.80, క్యారెట్ రూ.70, బెండకాయలు రూ.50, బీరకాయలు రూ.70, దొండకాయలు రూ.60, పచ్చిమిర్చి రూ.40, చిక్కుడు రూ.60, పెద్ద చిక్కుడు రూ.90, గోకరకాయ రూ.70, క్యాప్సికం రూ.70, బీన్స్ 90, కరివేపాకు రూ.80, దోసకాయ రూ.60. క్యాబేజీ రూ.40, ఉల్లి రూ.70, చింతపండు రూ.120.

భక్తిశ్రద్ధలతో డోలారోహణం


అమ్మవారికి హారతి ఇస్తున్న ఆదిత్య పరాశ్రీ స్వామీజీ

ఊట్కూరు, న్యూస్‌టుడే : బిజ్వార్ గ్రామంలోని అంబాభవానీ క్షేత్రం వద్ద దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. క్షేత్రంలో గురువారం రాత్రి త్రికోటి పీఠాధిపతి ఆదిత్య పరాశ్రీ స్వామి ఆధ్వర్యంలో మహాలక్ష్మి, మహేశ్వరి, మహా సరస్వతి మాతలకు డోలారోహణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. మాలధారణ భక్తులతో కలిసి ఆదిత్య పరాశ్రీ స్వామి దాండియా నృత్యాలు చేసి భక్తులను ఉత్సాహ పరిచారు. శుక్రవారం తెల్లవారుజామున అమ్మవార్లను బ్రహ్మచారిణిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవీ అష్టోత్తర శత నామ (108 కళశాలతో) కళశాభిషేకం, శతచండీ హోమం, లక్ష బిల్వార్చన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

పార్టీ కార్యాలయానికి ప్రభుత్వ స్థలం కేటాయించాలి

నారాయణపేట, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయానికి ప్రభుత్వ స్థలం కేటాయించాలని రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ గుర్నాథ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు చిట్టెం పర్ణికారెడ్డి, వాకిటి శ్రీహరి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కె.ప్రశాంత్‌కుమార్‌రెడ్డి కలెక్టర్ సిక్తాపట్నాయక్‌ను కోరారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడితో కలిసి వచ్చిన ఛైర్మన్, ఎమ్మెల్యేలు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సాధ్యమైనంత త్వరగా ప్రభుత్వం పార్టీ కార్యాలయ నిర్మాణానికి స్థలం కేటాయించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పలువురు పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ


పేటలో విధులను బహిష్కరించి నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

నారాయణపేట, న్యూస్‌టుడే: మద్దూర్‌పేట్ సీఐఎస్ పోలీసులు న్యాయవాది అబ్దుల్‌సలీంపై దాడి చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం పేటలో న్యాయవాదులు విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో న్యాయవాదుల రక్షణ లేకుండా పోయిందని, న్యాయవాదులపై హత్యలు, దాడులు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పలువురు న్యాయవాదులు పేర్కొన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు నందునాయక్, న్యాయవాది బీజేపీఎం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ చంద్రశేఖర్‌రెడ్డి, న్యాయవాదులు రఘువీర్ దత్, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

ధన్వాడ, న్యూస్‌టుడే: మండలంలోని కొండాపూర్ గిరిజన గురుకులానికి చెందిన విద్యార్థులు వెంకటేశ్, సిద్ధార్థ, వరుణ్ మార్క్, అరుణ్‌లు 68వ ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని ప్రిన్సిపల్ రాజారాం, పీఈటీ సురేందర్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 3, 4 తేదీల్లో జరిగిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 5 నుంచి 7వరకు రంగారెడ్డిలోని ప్రకాశం స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి పాలమూరు జట్టు తరఫున పాల్గొననున్నట్లు వివరించారు.

మీసేవ కేంద్రాలను తనిఖీ చేసిన ఈడీఎం

ధన్వాడ, న్యూస్‌టుడే: స్థానికంగా ఉన్న మీ సేవ కేంద్రాలను ఈడీఎం(ఈ జిల్లా జనరల్ మేనేజర్) విజయ్‌కుమార్ శుక్రవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రాల్లో ప్రదర్శన ఉంచిన ధరల పట్టికలను పరిశీలించారు. కార్యాలయంలో ఉన్న వినియోగదారులతో మాట్లాడారు. కొందరు సేవలకు తరమా అందరనిలో ఏర్పడుతున్న విషయాన్ని ప్రస్తావించారు. కొన్ని రోజులుగా ముందు సర్వర్ కారణంగా ఇబ్బందులు ఏర్పడ్డ విషయం వాస్తవమేనని ప్రస్తుతం అలాంటి సమస్యలేవీ లేవని గమ్మ కనుగుణంగా పనులు జరుగుతున్నాయి.










నారాయణపేట: బారంబావి ● సుభాష్‌రోడ్డులో.. ●శక్తిపీఠంలో గాయత్రిదేవిగా.. ●చౌక్‌బజారులో ●ధ్రువ్‌పేట భవనీ మాత ఆలయంలో.. ●పళ్లలో ప్రతిమ.. ●బురిడీవాడి హనుమాన్ మందిర్‌లో ●అంబేడ్కర్ చౌరస్తాలో

అమ్మ దర్శనం.. ఆధ్యాత్మిక శోభితం



బ్రహ్మణవాడి చౌడేశ్వరీ ఆలయంలో గాయత్రిదేవిగా అమ్మవారు


కోటకొండలో నగరేశ్వర దేవాలయంలో లక్ష్మీదేవి అలంకరణ

పాతబస్టాండ్(నారాయణపేట), న్యూస్‌టుడే: నవరాత్రి ఉత్సవాలు జిల్లా కేంద్రంలో ఘనంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు శుక్రవారం అమ్మవారు గాయత్రి దేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. శక్తి పీఠంలో మహిళలతో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. బ్రహ్మణవాడీలో ప్రతిష్ఠించిన దుర్గామాత మండపం వద్ద డా.గీత విశ్వనాథ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నప్రసాదం చేశారు.

మరికల్, ధన్వాడ, న్యూస్‌టుడే: దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మరికల్, ధన్వాడ మండలాల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి పూజలు నిర్వహించారు. మరికల్ పట్టణంలోని కుర్వవాడ శివాలయంలో ఏర్పాటు చేసిన కుంకుమార్చనలో మహిళలు భారీ ఎత్తున పాల్గొన్నారు. అమ్మవారిని గాయత్రి దేవిగా అలంకరించి పూజలు చేశారు.


ఊట్కూరులో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు


దామరగిద్ద: లక్ష్మిదేవిగా వాసవీమాత దర్శనం


మరికల్ : మార్కండేయ స్వామి ఆలయంలో

దామరగిద్ద, న్యూస్‌టుడే : జిల్లా సరిహద్దులోని కర్ణాటక గుల్బర్గా జిల్లా యానగుంది మాణిక్యగిరి క్షేత్రంలో దసరా ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు లక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు యజ్ఞం, స్వామివారి పల్లకీ సేవ నిర్వహించారు.

నర్వ, న్యూస్‌టుడే: మండలంలోని నర్వ, పాతర్‌చేడ్, లంకాల, పెద్దకడ్మూర్, కల్వాల, ఉందేకోడ్, రాయికోడ్ తదితర గ్రామాల్లో నవరాత్రి ఉత్సవాలను గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుంటున్నారు. అమ్మవారు పలు రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చింది.

మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే: మక్తల్ పట్టణంలోని ఆయా ఆలయాల్లో దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీ మాత లలితాదేవిగా భక్తులకు దర్శనమిచ్చి. గణపతి పూజ, సామూహిక కుంకుమార్చన, బతుకమ్మ సంబరాలు నిర్వహించారు.


మాణిక్యగిరిలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు


ధన్వాడ: అంబా భవాని ఆలయంలో గాయత్రి దేవిగా అలంకారం






మరికల్: శివాలయంలో కుంకుమార్చన.. ● దామరగిద్ద : మాణిక్యగిరిలో వేంకటేశ్వర స్వామి పల్లకీ ఊరేగింపు.. ●అమ్మవారి పూజల్లో పాల్గొన్న దళిత యువజన సంఘం నాయకులు.. ●మద్దూరు: కన్యకాపరమేశ్వరి ఆలయంలో మహిళల పూజలు

కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి

నారాయణపేట, న్యూస్‌టుడే: రైతులు ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డా.చిట్టెం పర్ణికరెడ్డి అన్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో శుక్రవారం పేట మండలం కొల్లంపల్లిలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తుందన్నారు. ధాన్యం ప్రైవేటులో విక్రయించి నష్టపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీవో మొగులప్ప, గ్రామ పెద్దలు, ఐకేపీ అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్ణికరెడ్డి

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

ధన్వాడ, న్యూస్‌టుడే: అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికరెడ్డి అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు ఆయా గ్రామాల్లో అందుబాటులో ఉండటం లేదన్న ఫిర్యాదులు ఉన్నాయని ఇకనైనా మారాలన్నారు. రాబోవు రోజుల్లో ఆకస్మిక తనిఖీలు ఉంటాయని అప్పుడు చర్యలు తప్పవన్నారు. అనంతరం ఒక్కొక్క గ్రామానికి చెందిన ప్రజలు నెలకొన్న సమస్యల్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా రహదారులు, విద్యుత్తు తాగునీటి అంశాలను ప్రస్తావించారు. వీటిని ఎమ్మెల్యే ఆయా అధికారులతో ప్రస్తావించి సాధ్యమైనంత తొందరగా పరిష్కరించాలన్నారు. తహసీల్దారు సింధూజ, ఎంపీడీవో సాయిప్రకాశ్, సింగిల్ విండో అధ్యక్షుడు వెంకట్రామారెడ్డి, మాజీ అధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

వానాకాలం పత్తి కొనుగోలుకు ఏర్పాట్లు


కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట, న్యూస్‌టుడే: వానాకాలం పత్తి కొనుగోలుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది పత్తి క్వింటాలుకు రూ. 7,521లు మద్దతు ధర ప్రకటించిందన్నారు. తేమ శాతం 12 మించకుండా కేంద్రాలకు తీసుకువచ్చేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పత్తిని అమ్మిన తర్వాత డబ్బు బ్యాంకు ఖాతాలో జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మార్కెటింగ్ అధికారిణి బాలమణి మాట్లాడుతూ వ్యవసాయాధికారుల లెక్క ప్రకారం జిల్లాలో 1,61,150 ఎకరాల్లో రైతులు పత్తిసాగుచేశారని, అందుకుగాను 9,90,900 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేయాల్సి ఉంటుందన్నారు. నారాయణపేట, మక్తల్ మార్కెట్లలో సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. పేట నియోజకవర్గంలో నాలుగు, మక్తల్‌లో 3 జిన్నింగ్ మిల్లులు ఉన్నాయని చెప్పారు. ఈ ఏడాది సైతం ప్రైవేటులో పత్తికి అధిక ధర లభిస్తే మిల్లుల వద్దకు రైతులు పెద్దసంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉందన్నారు. నవంబరు రెండోవారంలో పత్తి విక్రయాలు జరుగుతాయని డీఏఓ జాన్‌సుధాకర్ తెలిపారు. జిన్నింగ్ మిల్లుల్లో యజమానులు భద్రత ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, సీసీఐ, పోలీసు, మార్కెట్ యార్డు అధికారులు, మిల్లుల యజమానులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో మరిన్ని పతకాలు సాధించాలి: ఎస్పీ


పతకాలు సాధించిన డ్యూటీ మీట్ అధికారులతో ఎస్పీ యోగేశ్‌గౌతం

నారాయణపేట, న్యూస్‌టుడే: జిల్లా పోలీసు అధికారులు రాష్ట్రస్థాయిలోనూ జరిగే డ్యూటీ మీట్‌లో చక్కటి ప్రతిభ కనబరిచి మరిన్ని పతకాలు సాధించాలని ఎస్పీ యోగేశ్‌గౌతం అన్నారు. మహబూబ్‌నగర్ పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో జోగులాంబ జోన్-7 జోనల్ పోలీసు డ్యూటీ మీట్-2024లో భాగంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ నుంచి పోలీసు అధికారులు, సిబ్బంది వివిధ విభాగాల్లో పోటీపడ్డారు. ఇందులో పేట జిల్లాకు రెండో స్థానం దక్కింది. ప్రతిభ చాటిన సిబ్బందిని ఎస్పీ అభినందించి మాట్లాడారు. యాంటి విధ్వంసక తనిఖీ బృందం పోటీలో కాంస్య పతకం, రూమ్ సెర్చ్ బంగారు పతకం, గ్రౌండ్ సెర్చ్ కాంస్య పతకం, వాహన శోధన బంగారు పతకం (పీసీ చంద్రశేఖర్‌గౌడ్, ఆంజనేయులు), యాక్సెస్ కంట్రోల్ పోటీలో బంగారు పతకం (పీసీలు రేవంత్, కె.ఆంజనేయులు), మెడికల్ లీగల్ ఓరల్ టెస్టులో ధన్వాడ ఎస్సై రమేశ్ బ్రౌన్ పతకం, డాగ్ స్క్వాడ్ తనిఖీలో రవి, రుద్ర -గోల్డ్ ట్రాకర్, పరమేశ్, విక్కీ నార్కోటిక్‌లో సిల్వర్ మెడల్, వీడియో గ్రఫీలో పీఆర్వో సి.వెంకట్రాములు బ్రౌన్ మెడల్ సాధించారు. డ్యూటీ మీటలో 4 బంగారు పతకాలు, 2 రజత పతకాలు, 6 కాంస్య పతకాలు సాధించడం జరిగింది. నోడల్ అధికారి అదనపు ఎస్పీ ఎండీ రియాజ్ హుల్ హక్, పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.


గొంతులో కణితి తొలగింపు
ప్రభుత్వ ఆసుపత్రిలో అరుదైన చికిత్స

పాలమూరు, న్యూస్‌టుడే: స్వరపేటికలో కణితి ఏర్పడి ఇబ్బందులు పడుతున్న ఓ బాలుడికి మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వైద్యులు గురువారం అరుదైన శస్త్రచికిత్స చేసి తొలగించారు. శుక్రవారం ఆసుపత్రి వర్గాలు వివరాలు వెల్లడించాయి. నారాయణపేట జిల్లాకు చెందిన 16 ఏళ్ల చేతన్ కౌశిక్‌రెడ్డి మూడు నెలల నుంచి గొంతు నొప్పితో బాధపడుతున్నాడు. ఈ నెల 2న మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రికి రాగా సూపరింటెండెంట్ డా.సంపత్‌కుమార్ సింగ్ వైద్య పరీక్షలు చేశారు. స్వరపేటికలోని నాడులపై ఎడమ వైపు ఆవగింజంత కణితి ఉందని లాక్రోస్కోపిక్ ద్వారా గుర్తించారు. దాని వల్లనే గొంతు నొప్పితో పాటు మాటలు బొంగురుపోవడం తదితర సమస్యలతో ఇబ్బందులు పడుతుండటంతో బాలుడికి మైక్రో లారింజియల్ అనే ఆపరేషన్ చేసి కణితి తొలగించారు. బాలుడిని శుక్రవారం డిశ్చార్జి చేశారు.

సీఐ తీరును నిరసిస్తూ యువకుల ధర్నా

కోస్గి గ్రామీణం, న్యూస్‌టుడే : కోస్గి సీఐ దశ్రునాయక్ తమ పట్ల దురుసుగా ప్రవర్తించారంటూ ఓ వర్గానికి చెందిన భక్తులు నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం అర్ధరాత్రి రహదారిపై బైఠాయించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు ముగించుకుని కొందరు రహదారిపై నడిచి వస్తుండగా ఓ ప్రేమ జంట (ఇద్దరూ వేర్వేరు వర్గాలు) వారి కంట పడింది. ఈ విషయమై ప్రశ్నించి యువకుడిని కోస్గి ఠాణాకు తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న ప్రేమజంటలో యువకుడి వర్గీయులు సైతం ఠాణాకు చేరుకున్నారు. సీఐ తమను దూషించి బయటకు నెట్టేశారని, వేరేవర్గం వారిని ఏమీ అనలేదని కొందరు యువకులు అర్ధరాత్రి వేళ శివాజీ కూడలి వద్ద రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు.

ప్రతిభ కనబరచడం గర్వకారణం


విద్యాసాగర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే: ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో వ్యాయామ ఉపాధ్యాయ కేటగిరిలో జిల్లాలో మొదటి ర్యాంకు సాధించిన కాచ్‌వార్ గ్రామానికి చెందిన విద్యాసాగర్‌గౌడ్‌ను శుక్రవారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సన్మానించి మాట్లాడారు. విద్యాసాగర్ బీద కుటుంబంలో జన్మించి కష్టపడి ఉన్నత చదువులు చదివి ఒకేసారి మూడు ఉద్యోగాలు సాధించడం గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో గణేశ్, ఆనంద్‌గౌడ్, మదన్‌రెడ్డి, శ్రీకాంత్‌గౌడ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ బ్యాంకుకు భవనం మంజూరు చేయాలి

కోస్గి గ్రామీణం, న్యూస్‌టుడే: కొడంగల్ నియోజకవర్గంలో ఉన్న డీసీసీబీ బ్యాంకుకు సొంత భవనం మంజూరు చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి తిరుపతిరెడ్డిని మహబూబ్‌నగర్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ తూం భీంరెడ్డిలు కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తిరుపతిరెడ్డి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. వారు మాట్లాడుతూ కొడంగల్ నియోజకవర్గంలో డీసీసీబీ బ్యాంకు అద్దె భవనంలో నిర్వహిస్తున్నారని.. భవన నిర్మాణానికి 300 గజాల స్థలం కేటాయించాలని, భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఇన్‌ఛార్జి తిరుపతిరెడ్డి స్పందించి త్వరలో స్థలం కేటాయించి నిధులు మంజూరు చేయిస్తామని హామీనిచ్చినట్లు తెలిపారు.

మత్స్యకారులు ఆర్థికాభివృద్ధి సాధించాలి

ఊట్కూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని మత్స్యకారులు ఆర్థికాభివృద్ధి సాధించాలని జిల్లా మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు ఏ.కాంత్ కుమార్ అన్నారు. మండలంలోని చిన్నపొర్ల, పెద్దపొర్ల చెరువుల్లో మత్స్య సహకారం ఆధ్వర్యంలో ప్రైవేటుగా కొనుగోలు చేసిన చేప పిల్లలను శుక్రవారం చెరువులో వదిలి మాట్లాడారు. మారుతున్న కాలానుగుణంగా మత్స్యకారులు తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో మత్స్య సహకార సంఘం జిల్లా డైరెక్టర్ ఆనంద్‌కుమార్, ఉపాధ్యక్షుడు రామకృష్ణ, చిన్నపొర్ల మత్స్య సహకార సంఘం సభ్యులు కురుమూర్తి, ఆంజనేయులు, రాములు, భాస్కర్, దీపక్, అంజి, బాలరాజ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

రహదారి మరమ్మతులు చేపట్టాలని నిరసన

ఊట్కూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రం మీదుగా వెళ్లే మక్తల్- నారాయణపేట రహదారి మరమ్మతులు చేపట్టాలని సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వెంకట్రామారెడ్డి మాట్లాడుతూ రహదారిపై గోతులు ఏర్పడి, వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మక్తల్- నారాయణపేట రహదారిని నాలుగు లైన్ల రహదారి ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ చింత రవికి వినతిపత్రం సమర్పించారు. నాయకులు బి.నారాయణ, శంకర్, రాజు, ఎం.అంజప్ప, ఉగ్ర నరసింహ తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా డిజిటల్ సర్వే పూర్తి చేయాలి

ఊట్కూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న డిజిటల్ కార్డుల కుటుంబ సర్వేను సకాలంలో పూర్తి చేయాలని, వివరాల నమోదులో పారదర్శకత పాటించాలని నారాయణపేట స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విశాలక్షి అన్నారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో పైలట్ ప్రాజెక్టు కింద చేపడుతున్న డిజిటల్ కుటుంబ సర్వేను శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. వలస వెళ్లిన వారిని రప్పించి వందశాతం సర్వే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గ్రామంలో పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ కార్యకర్తలు, మరో ఇద్దరు సిబ్బందితో కలిపి పది బృందాలతో సర్వే చేపడుతున్నట్లు ఎంపీడీవో ధనుంజయ గౌడ్ వివరించారు. ఇప్పటి వరకు సర్వే పూర్తి చేసిన కుటుంబాల వివరాలను, నమోదు చేసిన అంశాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ చింత రవి, ఎంపీడీవో ధనుంజయ గౌడ్, ఎంపీవో లక్ష్మీనరసింహ రాజు, పంచాయతీ కార్యదర్శి శివ, అంగన్‌వాడీ కార్యకర్త ఇందిరా, పాల్గొన్నారు.

అయ్యావారిపల్లిలో..

దామరగిద్ద, న్యూస్‌టుడే: మండలంలోని అయ్యావారిపల్లి గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి రెండు రోజులుగా నిర్వహించిన డిజిటల్ కార్డు సర్వే శుక్రవారం ముగిసింది. గురు, శుక్రవారం రెండు రోజుల నిర్వహించిన ఈ సర్వే పూర్తైంది. అయ్యావారిపల్లి గ్రామంలో ఉన్న మొత్తం 111 కుటుంబాల సర్వే పూర్తి చేశారు. సర్వే పకడ్బందీగా నిర్వహించినట్లు ఎంపీడీవో తెలిపారు. ఎంపీడీవో సాయిలక్ష్మి, ఎంపీవో ఉదయ్‌శంకర్, గ్రామపంచాయతీ కార్యదర్శులు హాజరయ్యారు.


సర్వే వివరాలు అడిగి తెలుసుకుంటున్న పేట స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విశాలక్షి

సెలవుల్లో పాఠశాలలు కొనసాగిస్తే చర్యలు

కోస్గి న్యూటౌన్, న్యూస్‌టుడే: దసరా సెలవుల్లో నిబంధనలు పాటించకుండా పలు ప్రైవేట్ పాఠశాలలు తరగతులు కొనసాగించడం సరికాదని అలాంటి పాఠశాలలపై శాఖాపరమైన చర్యలు తప్పవని ఎంఈవో శంకర్ నాయక్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ విద్యార్థులపై చదువు ఒత్తిడి ప్రభావం లేకుండా విద్యా శాఖ దసరా సెలవులు ప్రకటిస్తే ఆ నిబంధనలు పాటించకుండా పలు ప్రైవేటు పాఠశాలలు తరగతులు కొనసాగిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలి

కోస్గి న్యూటౌన్, న్యూస్‌టుడే: డీఎస్సీ నియామకాల్లో నిబంధనల కారణంగా నష్టపోతున్న ప్రతిభ గల అభ్యర్థులకు న్యాయం చేయాలని తపస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మల్లికార్జున్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఉన్నత విద్యార్హతలు సాధించిన తర్వాత కింది స్థాయి విద్యార్హతలు సాధించడం కుదరదని నిబంధన పెట్టడం సమంజసం కాదని అన్నారు. కోస్గి మండలం ముక్తిపహాడ్ గ్రామానికి చెందిన కృష్ణయ్యగౌడ్ డీఎస్సీ-2024 ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ భౌతికశాస్త్రం విభాగంలో జిల్లా 2వ ర్యాంకు సాధించినప్పటికీ నిబంధనల కారణంగా ఉద్యోగం రాని పరిస్థితుల దృష్ట్యా ఆ అభ్యర్థికి న్యాయం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కోస్గి, గుండుమాల్ శాఖల అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్‌రాములు, వెంకటేశ్, ఆంజనేయులు, అనంతయ్య, అంజిలయ్య, రవితేజ తదితరులున్నారు.

నారాయణపేట పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన కేంద్రం ఆవరణలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అభ్యర్థులకు రెండో రోజు భోజన వసతి కల్పించారు. శేర్ కృష్ణారెడ్డి, నరసింహ, సంఘం నాయకులు సేవలందించారు. మధ్యాహ్న సమయంలో అభ్యర్థులకు ఏఎంవో రామచంద్రచారి, ఎస్‌వో నాగార్జున, జీసీడీవో పద్మనళిని, సీఎంవో రాజేంద్రకుమార్‌లు అభ్యర్థులకు భోజనం వడ్డించారు.

ధన్వాడలో భారీ వర్షం



ధన్వాడ, న్యూస్‌టుడే: ధన్వాడలో శుక్రవారం మధ్యాహ్నం వర్షం దంచి కొట్టింది. దీంతో లోతట్టు ప్రాంతాల్లో నీళ్లు నిలిచాయి. స్థానిక బ్యాంకు ఏరియా, మండల వనరుల కేంద్రం, గ్రంథాలయ ప్రాంతాలతో పాటు ఇబ్రహీం పంతులు దవాఖానా పరిసర ప్రాంతాల్లో నీళ్లు నిలిచి రాకపోకలకు అసౌకర్యం కలిగింది. మురుగుకాల్వల్లోని నీళ్లు రోడ్డెక్కి పారాయి.

చిరుతపులి దాడిలో జింక మృతి

ధన్వాడ, న్యూస్‌టుడే: మండలంలోని మందిపల్లి గ్రామ శివారులో మృతి చెందిన జింక కళేబరాన్ని గ్రామస్థులు శుక్రవారం గుర్తించారు. చిరుతపులి దాడితోనే జింక మృతి చెందినట్లు భావిస్తున్న గ్రామస్థులు ఈ విషయాన్ని అటవీ శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మధ్యాహ్నం అటవీ శాఖ అధికారి మల్లేష్ సంఘటన ప్రాంతాన్ని సందర్శించి జింక కళేబరాన్ని స్వాధీనం చేసుకొని విచారణ చేస్తున్నారు.